

నిధులు సకాలంలో ఖర్చు చేయాలి : స్మార్ట్ డైరెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సివిల్ వర్క్‌ల కోసం విడుదల చేసిన నిధులను పాఠశాలల అభివృద్ధి కోసం సకాలంలో ఖర్చు చేయాలని స్మార్ట్ డైరెక్టర్ మస్తానయ్య ఆదేశించారు. శుక్రవారం సమగ్రశిక్షా అభియాన్ కార్యాలయంలో పిఎం, సివిల్ వర్సుకు సంబంధింన నిధుల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమగ్రశిక్షా అభియాన్ పీవో వెంకటరమణ, డీఈవో వరలక్ష్మి, డీవైఈవో మధుసూదన్‌రావు పాల్గొన్నారు.



నిధులపై సమీక్ష చేస్తున్న స్మార్ట్ డైరెక్టర్ మస్తానయ్య

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులపై సమీక్షించిన జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా మంజూరు అనే పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని పిఆర్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరం నుండి జిల్లాలో జెడ్పి, 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా చేపట్టిన పనుల పురోగతిపై ఎంపీడీవోలు ఆర్డబ్ల్యుఎస్, పంచాయతీ సెక్రెటరీలతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 31 మండలాల్లో జడ్పీ,15వ ఆర్థిక సంఘం నిధుల నుండి తాగునీరు, సిమెంట్ రోడ్స్, మురుగునీటి కాలువలకు సంబంధించి పనులను మంజూరు చేయడం జరిగిందని, పురోగతిలో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. నిధులు మంజూరై ప్రారంభం గాని పనులను రద్దు చేయాలని తెలిపారు. పూర్తి అయిన పనులకు సంబంధించి బిల్లులను వెంటనే అప్లోడ్ చేయాలన్నారు. మండలాలలో ప్రజాప్రతినిధుల సూచనల మేరకు అవసరమైన అభివద్ధి కార్యక్రమాలకు సంబంధించి నిధులు మంజూరు చేయడం జరిగిందని, పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని తెలిపారు. తాగునీరు, డ్రైన్స్‌కు సంబంధించి రూ.5లక్షల లోపు పనులను 15రోజులలో పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీలలో గ్రామసభల ద్వారా గుర్తించి ఆమోదించిన పంపిన ప్రతిపాదనలకు నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పనుల పురోగతికి సంబంధించి జెడ్పి సీఈవో, డీపీఓలు సమన్వయం చేసుకొని పూర్తిచేయాలని ఆదేశించారు.



నెలకు ఒకసారి ఓవర్ హెడ్ ట్యాంకులను పరిశుభ్రం చేయాలని, కుళాయిల ద్వారా నాణ్యమైన తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఇంటింటి చెత్త సేకరణ సమర్థవంతంగా చేయాలని, సేకరించిన చెత్తను ప్రాసెస్ చేయాలని ఆదేశించారు. ప్రణాళిక బద్ధంగా ఓవర్ హెడ్ ట్యాంక్స్‌ను శుభ్రం చేయాలని, పంపుసెట్లు, బోర్వెల్స్ దగ్గర బహిరంగ మలమూత్ర విసర్జన జరగకుండా చర్యలు చేపట్టాలని, తాగునీటి పైపులల్లోకి మురుగునీరు కలవకుండా అవసరమైన చోట్ల మరమ్మతులు చేయాలని సూచించారు. జడ్పీ సీఈఓ రవికుమార్, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ విజయ్ కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 15,71,402 మంది ఓటర్లు

జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



రాజకీయ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఈనెల ఒకటో తేదీ నాటికి జిల్లాలో 15,71,402 మంది ఓటర్లు ఉన్నారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డిఆర్ఓ కె.మోహన్ కుమార్‌తో కలసి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పారాదర్శకమైన ఓటరు జాబితా తయారీ చేయడంలో భాగంగా మరణించిన వారి పేర్లను తొలగించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఎలెక్షన్ సెల్ అధికారులు సమన్వయం చేసుకుని ప్రతినియోజక వర్గంలో సచివాలయం వారీగా మరణించిన వారిని ఓటర్ల జాబితా నుండి తొలగించే ప్రక్రియ ప్రారంభించడం జరిగిందని, ప్రతి మూడు నెలలకు ఒకసారి ఓటర్ల జాబితా తయారు చేసి రాజకీయపార్టీ నాయకులకు అందజేయడం జరుగుతుందని, అందులో మీ సలహాలు సూచనలు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. రివిజన్ 3 కింద ఏప్రిల్ 2025 నుండి జూన్ 2025 వరకు కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. 7 నియోజకవర్గంలో మరణించిన వారి సంఖ్య 874 మంది ఓటర్లను తొలగించడం జరిగిందన్నారు. షిఫ్ట్ ఓటర్లు 833 గుర్తించడం జరిగిందని, రిపీటెడ్ ఓటర్లు 542 ఓటర్లను గుర్తించడం జరిగిందని మొత్తం 2249 ఓటర్లను గుర్తించడం జరిగిందన్నారు. ఫారం 6, ఫారం 8 కింద 3,049 మంది ఓటర్లు అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 10,615 మంది ఓటర్లకు ఎపిక్ కార్డులు పోస్టల్ ద్వారా ఓటర్లకి అందజేయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బీఎల్వోలుకి ప్రాపర్‌గా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఓటరు జాబితా తయారీ చేయడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గానికి ఓటర్ల జాబితాలో పేర్లను మార్పుకు సంబంధించి అంశాలను పరిశీలించాలని సిపిఎం ప్రతినిధి వాడ గంగరాజు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. టిడిపి ప్రతినిధి సురేంద్ర కుమార్, పోలింగ్ స్టేషన్‌లను ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో కొత్తగా ఓటర్లు నమోదైన వారికి కార్డుల పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని బిజెపి ప్రతినిధి అట్లూరి శ్రీనివాసులు తెలిపారు.



రాజమ్మ మృతికి నివాళి అర్పిస్తున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి

కందారపు మురళీకి మాతృవియోగం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, సిపిఎం సీనియర్ నేత కందారపు మురళీకి మాతృ వియోగం కలిగింది. కందారపు రాజమ్మ (82) స్విమ్స్ ఆసుపత్రిలో గత వారం రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు కన్నుమూశారు. ఆమెకు కందారపు మురళీ పెద్దకొడుకు ఆయనతోపాటు



ఇద్దరు చెల్లెల్లు, ఒక తమ్ముడు ఉన్నారు. వృద్ధాప్య సమస్యలతో పాటు మెదడులో బ్లీడింగ్ ఏర్పడడంతో వారం రోజులుగా స్విమ్స్ ఆసుపత్రిలో ఆమె చికిత్స పొందుతూ మరణించారు. అంత్యక్రియలు శనివారం మధ్యాహ్నం తిరుపతి నగరంలోని కరకంబాడి రోడ్డు గోవింద ధామంలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. తమ తల్లి కందారపు రాజమ్మ నేత్రాలను రుయా ఆసుపత్రి 'ఐ' బ్యాంకుకు దానం చేసినట్లు సిపిఎం నేత కందారపు మురళి తెలిపారు.

కందారపు రాజమ్మ మృతికి సంతాపం

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, సిపిఎం సీనియర్ నేత కందారపు మురళీ తల్లి కందారపు రాజమ్మ (82) మృతి భాదాకరమని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు అన్నారు. శుక్రవారం ఆమె భౌతిక ఖాయానికి పూలమాలవేసి సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా కందారపు మురళి, కందారపు మోహన్ కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగిందన్నారు.

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, సిపిఎం సీనియర్ నేత కందరపు మురళి మాతృమూర్తి కందారపు రాజమ్మ మృతికి పలువురు నివాళులర్పించారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి, సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్, తిరుపతి జిల్లా సిపిఎం కార్యదర్శి వి.నాగరాజు, చిత్తూరు జిల్లా సిపిఎం కన్వీనర్ వి.గంగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, డి.జనార్ధన్, జిల్లా కమిటీ సభ్యులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి రాజమ్మకు నివాళులర్పించారు.

యోగాతో ప్రశాంతమైన జీవనం : ఎంపి



న్యాయమూర్తుల శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప వరం యోగ అని, ప్రతి వ్యక్తికి యోగా నిత్యజీవితంలో ఒక భాగం కావాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పివికేఎన్ ప్రభుత్వ కాలేజ్‌లో నిర్వహించిన 5వ రాష్ట్ర స్థాయి న్యాయమూర్తుల శిక్షణా తరగతులకు చిత్తూరు ఎంపీ, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ యోగా ప్రజల నిత్యజీవితంలో ఒక భాగం కావాలని, ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం గడపడానికి దైనందన జీవితంలో యోగా సాధన నిరంతర ప్రక్రియగా ఉండాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమాలను గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు విజయవంతంగా నిర్వహించినందుకు ప్రతి అధికారికి అభినందనలు తెలిపారు. అధికారులు మరియు సిబ్బంది కృషి వల్లనే యోగా కార్యక్రమాన్ని నిర్వహించామని ప్రతిరోజు యోగా తప్పకుండా పాటిస్తే ఆరోగ్యం ఎంతో బాగుంటుందని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యాన్ని ఆధ్యాత్మికతను ప్రశాంతమైన జీవనాన్ని గడపగలమని తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని తెలిపారు. యోగా ద్వారా ప్రజల మానసిక, శారీరక ధృడత్వం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ ఎస్.అముద, చూడ చైర్మన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, పివికెఎన్ ప్రిన్సిపాల్, నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సమ్మె విరమణ

చర్చలు సఫలం

నెల రోజుల్లోపు 5 నెలలు వేతనాలు ఇస్తాం: రాయలసీమ కోఆర్డినేటర్ చంద్రశేఖర్

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): జిల్లాలో ఉన్న ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు 13 నెలల బకాయి వేతనాలు ఇవ్వాలని, సెలవులు మంజూరు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేసి సమ్మెకు వెళ్లిన విషయం విధితమే. సమ్మెకు స్పందించిన రాష్ట్ర అధికారులు శుక్రవారం చిత్తూరులోని మామిడి భవన్లో ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల యూనియన్‌తో ఉదయం నుండి సాయంత్రం వరకు సుదీర్ఘంగా చర్చలు జరిపి కొన్ని సమస్యలు పరిష్కారం చేయడంతో సమ్మె విరమణ చేస్తున్నట్లు యూనియన్ నిర్ణయం చేసినట్లు నాయకులు ప్రకటించారు. పది రోజులు సమయం ఇస్తామని అప్పటికి సమస్యలు పరిష్కారం కాకపోతే మళ్లీ సమ్మెబాట పడతామని యూనియన్ నాయకులు తెలిపారు. తెలిపారు. ఈసదర్భంగా రాయలసీమ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, సురేష్ రెడ్డి, జిల్లా డిపిఎం వాసు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు ప్రభుత్వ సెలవులు అమలు చేస్తామని, అర్హులకు ప్రమోషన్ ఇస్తామని, నెల రోజుల్లోపు 5 నెలలు వేతనాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ చర్చలలో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, భారతి, గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, కోశాధికారి హనుమంతు, జిల్లాలోని ఉద్యోగులు పాల్గొన్నారు.





ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులతో చర్చలు జరుపుతున్న అధికారులు

దేవాదాయ భూముల పరిరక్షణకు చర్యలు

- ఆక్రమణలు తొలగింపు
- వన్‌బి అండగల్ దేవాలయాల పేర్లతో..

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలోని దేవాదాయ శాఖ భూములను తప్పనిసరిగా పరిరక్షించాలని డిఆర్ఓ కె.మోహన్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం డిఆర్ఓ ఛాంబర్‌లో దేవాలయ భూముల పరిరక్షణపై జిల్లాస్థాయి భూ సంరక్షణ కమిటీ సభ్యులతో డీఆర్ఓ అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ... జిల్లాలో మొత్తంగా 17,540 ఎకరాల దేవాలయ భూములు ఉన్నాయన్నారు. ఈ భూములన్నింటినీ కూడా తప్పనిసరిగా సంరక్షించాలన్నారు. ఎక్కడైనా ఆక్రమణకు గురై ఉంటే వెంటనే గుర్తించి వాటిని తొలగించాలని ఆదేశించారు. జిల్లాలో ఆక్రమణలో గుర్తించిన 1343.17 ఎకరాల భూములలో ఉన్న ఆక్రమణలను తొలగించాలని, ఇందుకు సంబంధించి ఏదేని కోర్టుల్లో కేసులు ఉన్న వాటికి వెంటనే స్టే వెకేషన్ కొరకు కౌంటర్ దాఖలు చేయాలని దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తంగా ఉన్న 9,761ఎకరాలకు గాను గత ఏడాది సెప్టెంబర్ మాసంలో నిర్వహించిన సమావేశం నాటికి 4,866 ఎకరాల భూములు 1బి అడంగల్‌లో దేవాలయ పేర్లు నమోదు కావడం జరిగిందన్నారు. ప్రస్తుతం 5,500 ఎకరాలకు సంబంధించి వన్ బిలో పేర్లు నమోదు కావడం జరిగిందన్నారు. ఇంకను దాదాపు 2,200 పైబడిన భూములకు వెంటనే వన్ బి అడంగల్‌లో సంబంధిత దేవాలయ పేర్లు నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. ఆలయాల భూములు పరిరక్షించడానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మొదటి సమావేశం నిర్వహించుచున్నామని డీఆర్ఓ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఛైర్మన్, జిల్లా ఎస్పీ, జాయింట్ కలెక్టర్ సభ్యులు, జిల్లా ఎండొమెంట్స్ అధికారి, అసిస్టెంట్ కమిషనర్, సభ్య కార్యదర్శులు, జిల్లా రెవెన్యూ అధికారి, సబ్ కలెక్టర్, మునిసిపల్ కమిషనర్లు, ఆర్ అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ స్టెంట్ డైరెక్టర్ (ల్యాండ్ రికార్డ్స్), జిల్లా రిజిస్ట్రార్ సభ్యులుగా ఉంటారని తెలిపారు. డిఆర్ఓ మాట్లాడుతూ కొన్నిచోట్ల దేవాలయ భూములను తక్కువ ధరకు వేలంలో లీజుకి ఇస్తున్నట్లు దృష్టికి వచ్చిందన్నారు. సరైన ధరకు వేలం నిర్వహించి భూములను లీజుకు ఇవ్వాలని ఈవోలను ఆదేశించారు. వివాదాస్పద భూములన్నింటిని సర్వే చేయాలని సూచించారు. జాయింట్ సర్వే పెండింగ్ ఉన్న వాటిని ఆయా శాఖలు సమన్వయంతో 30 రోజులు లోపల పూర్తి చేయాలన్నారు. వన్ బి అడంగల్ పేరు మార్పులను 45రోజులు లోపల చేయాలని రెవెన్యూ శాఖకు సూచించారు. ఆలయానికి ఆదాయం పెంచాలని, ప్రతి దేవాలయం భూమిని వేలంలో లీజుకు ఇవ్వాలన్నారు. భూములను గుర్తించిన పిదప వాటిని లీజుకు ఇవ్వడం ద్వారా దేవాలయ ఆర్థిక స్థితి మెరుగుమెరుగుపడుతుందని తెలిపారు. ప్రతినెలా ఈ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఓ మోహన్‌కుమార్

ప్రతిభకు పేదరికం అడ్డుకాదు..

ఆమ్యాక్స్ సీఈవో దశరథరెడ్డి



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందిస్తున్న దశరథరెడ్డి



ప్రజాశక్తి- వి కోట: పేదరికంలో పుట్టి ఉత్తమ ప్రతిభ కలిగిన విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పేదరికం అడ్డుకారాదని ఆమ్యాక్స్ సీఈఓ దశరథ రెడ్డి అన్నారు. ఈ సదర్భంగా శుక్రవారం వీకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సర చదువుతున్న మమత ఎంపీసీ విభాగంలో 460 మార్కులు, తస్మియా భాను సీఈసీ విభాగంలో 486 మార్కులు సాధించారని తెలిపారు. అలాగే మొదటి సంవత్సరం పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించి ఒక్కొక్క విద్యార్థికి రూ.5116లు చొప్పున ప్రోత్సాహక బహుమతులను అందించారు. ఈ సందర్భంగా దశరథ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువులలో ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని అధిరోహించేందుకు ప్రభుత్వ సహకారంతోపాటు దాతల సహకారాలను సద్వినియోగం చేసుకుంటూ ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకొని మిగిలిన విద్యార్థులు కూడా పోటీపడి చదివి మంచి మార్కులు సాధించి తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణారెడ్డి దాతలు సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

గోల్‌మాల్ మార్ట్

- సభ్యుల వాటా ధనం స్వాహా..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

మహిళా మార్టులు గోల్‌మాల్ మార్టులుగా మారాయా..? అంటే అవుననే చెప్పాలి.. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను లక్షాధికారులుగా మారుస్తాం... కార్పొరేట్ హంగులతో గత ప్రభుత్వం జగనన్న మహిళా మార్టులు గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రభుత్వం మారాకా వీటిని మహిళా మార్టులుగా పేరు మార్చారు.. పెద్దసంఖ్యలో ఉన్న స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు తమ కుటుంబ అవసరాల కోసం పట్టణ పేదరిక నిర్మూలణా సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన షాపింగ్ మార్టులో వస్తువుల కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇలా జిల్లాలోనే మొట్టమొదటగా చిత్తూరులో ఏర్పాటు చేయడంతో పాటు మదనపల్లి, పుంగనూరు ఉమ్మడి జిల్లాలోని మరికొన్ని ముఖ్య పట్టణాల్లో మహిళా మార్టులు ఏర్పాటు చేశారు.

లక్ష్యం బాగున్నా... మెప్మా అధికారులు చేతి వాటంతో స్వయం సహాయక సంఘాల మూలధనం బ్యాంకు ఖాతాలో మాయమైన్నట్లు సమాచారం. మార్టుల ద్వారా వచ్చే లాభాలను స్వయం సహాయక సంఘాల్లోని



చిత్తూరులో మెప్మా ఆధ్వర్యంలో నడుస్తున్న మహిళా మార్టు

మహిళలకే అందిస్తామని చెప్పినా ఇప్పటి వరకు స్వయం సహాయక సంఘాల్లోని మహిళల బ్యాంకు ఖాతాల్లో ఒక్క రూపాయి జమ కాలేదని స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు బహిరంగంగా వాపోతున్నారు.

చిత్తూరు జిల్లాలో దాదాపుగా 9 వేల మంది పట్టణ పేదరిక నిర్మూలన పథకంలో సభ్యులుగా ఉన్నారు. గత ప్రభుత్వంలో మహిళా మార్టుల ఏర్పాటు కోసం ప్రతి స్వయం సహాయక సంఘం సభ్యురాలి నుండీ మూల ధనం కింద రూ.410లు సేకరించారు. ఇలా దాదాపు మెప్మా రూ.38లక్షల మేర మూలధన నిధి స్వయం సహాయక సంఘాల సభ్యుల నుండీ సేకరించింది. ఇలా సేకరించిన నిధులకు ఎలాంటి లెక్క, పక్క లేకపోగా ఈ డబ్బులు మెప్మా బ్యాంకు ఖాతా నుండీ మాయమైన్నట్లు సమాచారం. అలాగే మహిళా మార్టుల ద్వారా వచ్చిన లాభం ఏమైందని స్వయం సహాయ సంఘాల సభ్యులు ప్రశ్నిస్తున్నారు. రోజుకు రూ.50వేలకు పైగా వ్యాపారం జరిగే మార్టుకు నెలకు రూ.15 నుండీ 20 వేల మరకు ఆదాయం వచ్చే అవకాశముందని జిల్లాలోని మార్టుల ద్వారా వచ్చన ఆదాయంపై మెప్మా వద్ద ఎలాంటి లెక్కలు లేకపోవడం, ఆడిట్, జిల్లా స్థాయి సమావేశాల్లో మహిళా మార్టుల ఖర్చులు, లాభాలపై ఎలాంటి చర్చ లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ప్రతి స్వయం సహాయక సంఘం సభ్యురాలు తప్పనిసరిగా మహిళా మార్టులో నెలకు కనీసం రూ.1000లు కొనుగోలు చేయాలని సంఘమిత్రలు హుకుం జారీ చేస్తున్నారు. మొదట్లో వివిధ బ్రాండ్ల నిత్యావసర వస్తులు, గృహావసర వస్తులు, స్వయం సహాయ సంఘాల ఉత్పత్తులు మార్టుల్లో అమ్మకానికి పెట్టేవారు. ప్రస్తుతం పరిమితమైన వస్తువులు మాత్రమే దర్శనం ఇస్తున్నాయి. ఇదిలా ఉంటే స్వయం సహాయ సంఘాల మూలధనం, మార్టుల ద్వారా వచ్చిన లాభాల విషయం తెల్చాలని స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు కోరుతున్నారు. పైసా, పైసా కుడబెట్టిన డబ్బులను మార్టుల ఏర్పాటు కోసం మూలధనంగా ఇచ్చామంటున్నారు. జిల్లా స్థాయి అధికారులు మహిళా మార్టుల గోల్‌మాల్‌పై విచారణ జరిపితే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.

గ్రామబహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కి సిపిఎం వినతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గత నెల 26న కాణిపాకం గంగమ్మ జాతర కమిటీ ఛైర్మన్ పరదేశిని అగ్రకులస్తుల ప్రోద్భలంతో గ్రామ బహిష్కరణ చేయడం దారుణమని, గ్రామ బహిష్కరణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం పరదేశితో కలిసి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో గంగమ్మ జాతర ఛైర్మన్ పరదేశిని గ్రామసాంఘిక బహిష్కరణ చేయడం దుర్మార్గమన్నారు. పోలీసులు రాజకీయ వ్యక్తులకు తలొగ్గి కేసుపెట్టి వారిపై చర్యలు తీసుకోకపోవడం ఏమిటి అని ప్రశ్నించారు. ప్రస్తుత కాలంలో కూడా బహిష్కరణ చేయడం బాధాకరమని, ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరించకుండా నిర్లక్ష్యం చేయడం సరైంది కాదన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రంలో ఇలాంటి ఘటనలు జరగడం శోచనీయమన్నారు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకొని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలను పునరావృతం కాకుండా చూడాలన్నారు. కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులను పిలిచి ఈ ఘటనపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివ రాజా సిబ్బంది గతంలో ఇదే పాఠశాలలో పనిచేసే బదిలీపై వెళ్లిన ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం ఎల్లయ్య, వహాబ్ జాన్, శంషాద్ లను పాఠశాలలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం గా ఎల్లయ్య దాదాపు ఎనిమిది సంవత్సరాలు ఇదే పాఠశాలలో పనిచేయడం విద్యార్థుల తల్లిదండ్రుల అభిమానాన్ని చూరగొని విధులు నిర్వహించారని అభినందించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామ్మోహన్ సురేష్ ఇందిరమ్మ బీబీ పాల్గొన్నారు.

రేపు 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమలలో మార్కెట్ యార్డ్ పక్కన ఈనెల 13 ఆదివారం మాజీమంత్రి , పుంగనూరు ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహణ కోసం కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు మండల వైసిపి అధ్యక్షులు గంగాధర రాయల్ శుక్రవారం తెలిపారు. ఎన్నికల హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ ప్రజలకు అన్యాయం చేస్తున్న చంద్రబాబు విధానాలను ప్రజల్లో తీసుకెళ్లేందుకు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అందరూ వైసిపి నాయకులు కార్యకర్తలు తప్పక సమావేశానికి హాజరుకావాలని వారు తెలిపారు. శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరయ్య వైస్ ఎంపీపీ ప్రభాకర్ మాజీ ఎంపీపీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వరదం వెంకటరమణ , లక్ష్మీపతి రాజారెడ్డి, శివ, శ్రీరాములు పాల్గొన్నారు.



పాఠశాలకు కుర్చీలు వితరణ చేస్తున్న దాతలు

కుర్చీలు వితరణ

ప్రజాశక్తి -విజయపురం: స్థానిక మండలం శ్రీహరిపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు విశ్రాంత ఉపాధ్యాయులు ఎరుకలయ్య లలితమ్మ దంపతులు కుర్చీలు ప్రధానోపాధ్యాయులు వెంకటరాజుకు శుక్రవారం వితరణ చేశారు. పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి సహకరించాలని ఎంఈవో హరిప్రసాద్ వర్మ పేర్కొన్నారు. దాతలను విద్యా కమిటీ సభ్యులు సత్కరించారు. విశ్రాంత ఎంఈవో జయచేంద్రన్, విద్యాకమిటీ చైర్మన్ చిన్నపొదయ్య, ఉపాధ్యాయులు సురలక్ష్మి, సురేష్, గ్రామస్తులు సురేష్, జయరామరాజు, చెంచురాజు, నరేష్ పాల్గొన్నారు.

వాహనం ఇలా..చెత్త సేకరణ ఎలా..?



మూలనపడ్డ చెత్త సేకరణ వాహనం

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలం లోని గ్రామ పంచాయతీలలో ప్రజలు పడేసిన చెత్త సేకరించి సంపద ఉత్పత్తి కేంద్రా లకు తరలించేందుకు గత ప్రభుత్వం రూ. లక్షలు వెచ్చించి ఈ ఆటోలు అందించింది. పొడి, తడి చెత్త వేరువేరుగా వేసేందుకు ఆటోలో విభాగాలు ఏర్పాటు చేశారు. కొద్ది రోజులు చెత్త సేకరించిన తర్వాత కొద్ది రోజులకే మరమ్మతులకు గురై మూలన పడ్డాయి. దీంతో రూ. లక్షలు వెచ్చించిన ఆటోలు శిథిలావస్థకు చేరాయి. అధికారులు స్పందించి బాగు చేస్తే లక్ష్యం నెరవేవుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వేసవి ముగిసినా భానుడు ప్రతాపం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: వేసవి కాలం ముగిసినా భానుడి ప్రతాపం తగ్గుముఖం పట్టలేదు. శుక్రవారం సూర్య తాపానికి పగలంతా ఉక్క పోతతో ప్రజలు అల్లాడారు. వేసవి కాలంలో ఉండాల్సిన వేడి కంటే అధిక శాతం వేడి ఉండడంతో ప్రజల ఉక్కపోతకు గురవుతున్నారు. సాయంత్రం ఆరు అవుతున్నా సూర్యుడి వేడిమి చల్లారలేదు. ఈ కారణంగా రహదారులు జన సంచారం లేక నిర్మానుష్యంగా మారాయి.

ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ 74 వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధ్యక్ష కార్యదర్శ సభ్యులు, ఈ సందర్భంగా సిఐటియు పలమనేరు నియోజకవర్గ నాయకుడు చెన్నకేశవులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో ప్రెసిడెంట్ బాలకృష్ణ, గౌరవాధ్యక్షులు హేమాచలం సెక్రెటరీ నూర్ బాషా, సభ్యులు పాల్గొన్నారు.

గురుకుల జూనియర్ కళాశాల సందర్శన

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పట్టణంలో డాక్టరు బిఆర్. అంబేద్కర్ గురుకుల జూనియర్ కళాశాలను ఎస్సి, ఎస్టి విజిలెన్స్ కమిటీ సభ్యులు శేషాద్రి శుక్రవారం సందర్శించారని ప్రిన్సిపల్ తెలిపారు. 10 వతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులతో ఇక్కడ వసతులు, చదువు, భోజనాలు బాగున్నాయా ?' అని ప్రశ్నించగా, విద్యార్థులు తమకు అన్ని వసతులు, టీచర్స్ బోధనతో పాటు భోజనం బాగుందన్నారు. ముఖ్యంగా తమకు నీటి వసతి సమస్యగా వుందని కాలేజీకి ట్యాంకర్ తో నీరు తీసుకురావాల్సి వుందని బోర్ రిపేర్ చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. మొత్తం 640 మంది బాలికలు ఇక్కడ విద్య అభ్యసిస్తున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకొనివెళ్లి పరిష్కరిస్తామని శేషాద్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీచర్స్, ప్రిన్సిపల్ పద్మావతి, వార్డెన్, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికార పార్టీ అండదండలతో భూ కబ్జా

చర్యలు తీసుకున్న తహశీల్దారు



ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: పాతపేట కుప్పనపల్లి వెళ్లే జాతీయ రహదారిలో రామభద్రయ్య కుంట మలుపు వద్ద లక్షలు విలువ చేసే ప్రభుత్వ భూమిని పాతపేట గ్రామానికి చెందిన టిడిపి సభ్యుడైన షణ్ముగం సర్వే నెంబర్197/బి2 స్థలాన్ని రెండు రోజులుగా జెసిబిల సహాయంతో మట్టితోలి చదును చేసి ఆక్రమించుకున్నాడు. ఇది తెలుసుకున్న పాతపేట కుప్పనపల్లి గ్రామస్తులు తహశీల్దారుకు తెలిపారు. మా భూమి కబ్జా చేస్తున్న షణ్ముగం ఆ భూమి వద్దకు రాకూడదని రెండు రోజులకు ముందే తెలిపారు. అయినా వినకుండా మళ్లీ అక్కడికొచ్చి భూమిని చదును చేస్తున్న విషయాన్ని తహశీల్దారుకి గ్రామస్తులు తెలిపారు. వారు వెంటనే స్పందించి స్థానిక గ్రామ రెవెన్యూ అధికారి గురవిరెడ్డి, గ్రామ సర్వేయర్ కె మధు అక్కడికి చేరుకొని మళ్లీ సర్వే నిర్వహించి ఇది ప్రభుత్వ స్థలమని గుర్తించారు. ఈ స్థలంలో ఎవరూ రాకూడదని అక్కడికి వెళ్లి షణ్ముగంకి తెలిపి ఇక్కడ చేస్తున్న పనులను ఆపించాలని తహశీల్దారు హెచ్చరించారు. ఆ ప్రభుత్వ భూమిని ఆక్రమించకూడదని పాతపేట కుప్పనపల్లి గ్రామస్తులను అధికారులు ఆదేశించారు. ఈ విషయమై తహశీల్దారును విచారణ కోరగా త్వరలోనే బోర్డు నిర్మిస్తామని వారు తెలిపారు.

బయో ఇథనాల్ ప్లాంట్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

ప్లాంట్ గురించి పూర్తి సమాచారం తెలపాలన్న గ్రామస్తులు



ప్రజాశక్తి- విజయపురం: బయో ఇథనాల్ ప్లాంటు ఏర్పాటుకు శుక్రవారం మండలంలోని బూదివానత్తం పంచాయతీ ఆమగుంటలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. పన్నూరు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 47/1,2,3,4,5లో గ్రీన్ ఎనర్జీ ఎకో ఇథనాల్ ప్రవేటు లిమిటెడ్ కంపెనీ వారు 300కేఎల్పీ గ్రెయిన్ బేస్, డ్ డిస్టలరీ యూనిట్, 9 ఎమ్ఎడబ్ల్యు కో జనరల్ యూనిట్ ఏర్పాటు కోసం పర్యావరణ ప్రజా అభిప్రాయ సేకరణను చిత్తూరు జాయింట్ కలెక్టర్ విద్యాధరి సమక్షంలో నిర్వహించారు. ప్లాంటు రూ.300కోట్ల ప్రాజెక్టుతో 200 మంది మ్యాన్ పవర్తో ఏర్పాటు చేయడానికి ముందస్తు అనుమతిగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర పర్యావరణ అనుమతుల కోసం ప్రజా అభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నామని కంపెనీ వర్గాలు తెలిపారు. కంపెనీకి చుట్టు పక్కల గ్రామాలు ఆమగుంట, తెల్లగుంట, చెంగమనాయుడు కండ్రిగ, బూదివానత్తం, పన్నూరు, గొల్లకండ్రిగ గ్రామాల నుండి ప్రజాభిప్రా య సేకరణ నిర్వ హిం చారు. కంపెనీతో చుట్టు ప్రక్కల వారికి ఉపాధి వస్తుందని కానీ ప్లాంటు వలన కలిగే అనర్ధాలు ముందుగానే తమకు విధి విధానాలు చెప్పాలని గ్రామస్తులు కోరారు. ప్లాంటుకు చుట్టు పక్కల సుమారు 440 హెక్టార్లలో వ్యవసాయం జరుగుతుందని, పన్నూరు చెరువు దగ్గర్లో ఉందని, వ్యవసాయమే జీవనాధారంగా సాగు చేస్తున్నామని, చుట్టు పక్కల పర్యావరణం, తాగునీరు, సాగునీరు కలుషితమైతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాంటుకు నీరు ఎక్కడ నుండి వస్తుంది, ప్లాంటు ద్వారా వ్యర్థాలు వస్తే ఎక్కడ వేస్తారు వంటి పూర్తి సమాచారం తమకు తెలిపి, అవగాహన కల్పించిన తరువాత ప్లాంటు నెలకొల్పాలని గ్రామస్తులు కోరారు. మండలంలో పరిశ్రమల కోసం కోసలనగరం ప్రాంతంలో భూములు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆ దిశగా పరిశీలించాలని కోరారు. తహశీల్దార్ కిషోర్, ఎంపీడీవో రాజేంద్ర, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్ రాజు, కో ఆప్షన్ నెంబర్ రాజేంద్రన్, పర్యావరణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

గాయపడ్డ జింక పిల్లకు ప్రథమ చికిత్స

తిరుపతి వెటర్నరీ యూనివర్సిటీకి తరలింపు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ మేటి మంద గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతం నుండి దప్పిక తీర్చుకునేందుకు అర్ధరాత్రి వేళ వచ్చిన ఒకటిన్నర సంవత్సరం వయసు కలిగిన ఆడ జింక ప్రమాదవశాత్తు గాయపడి రోడ్డు పక్కగా పడి ఉండడంతో గుర్తించిన గ్రామస్తులు అటవీ సిబ్బందికి తెలిపారు. వారు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి అనంతరం గ్రామస్తుల అటవీ శాఖ సిబ్బంది కలిసి ఆటోలో కందూరు పశు వైద్య కేంద్రానికి తీసుకువెళ్లగా అక్కడ పశు వైద్య అధికారిణి చందన ప్రియ, జి ఎం సి సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి కాలుకు కట్టు కట్టి ప్రథమ చికిత్స చేశారు. మరింత మెరుగైన వైద్యం



కోసం తిరుపతి వెటర్నరీ యూనివర్సిటీకి తరలించామని తెలిపారు. తీవ్ర రక్తస్రావం జరగడం కాలు ఎముక పూర్తిగా విరగడంతో కొద్దిరోజులు ప్రత్యేక వైద్యం అందించి ఆ తర్వాత అడవిలో వదలాల్సి ఉంటుందని అంతవరకు ప్రత్యేక శ్రద్ధగా కాపాడాల్సిన అవసరం ఉందని అందుకు వెటర్నరీ వి యూనివర్సిటీకి రెఫర్ చేసినట్టు వైద్య సిబ్బంది తెలిపారు.

కుటుంబ నియంత్రణతో ఆరోగ్యకర కుటుంబం

ప్రజాశక్తి - గంగవరం: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ జె శ్రీనివాసులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమ్మాయి వివాహ వయసు 18 సంవత్స రాలు, అబ్బాయికి 21 సంవత్సరం తర్వాతే వివాహం చేయాలని సూచించారు. కుటుంబ నియంత్రణ లో మగ వారి పాత్ర ఎంతో ముఖ్యమని అర్హులైన దంపతు లందరూ సురక్షితమైన కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటిస్తే ఆరోగ్యకరమైన కుటుంబం సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ లహరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: చిత్తూరు మండలం తుమ్మింద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషియల్ ఉపాధ్యాయురాలు వసంత లక్ష్మి ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు సంజీవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కాలప్ప , లలిత , అమరనాథ్, శంకర్ నాయక్, జయమని , జ్ఞాన దీపం రమాదేవి , ఈశ్వరి పాల్గొన్నారు.

రొంపిచర్ల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రొంపిచర్ల వైద్యాధికారి డాక్టర్ దినేశ్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో 'ప్రపంచ జనాభా దినోత్సవం" ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భం గా డాక్టర్ మాట్లాడుతూ 'ప్రణాళికా బద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణల మధ్య ఆరోగ్యకరమైన సమయం, అంతరం" అనే సందేశాన్ని ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. కుటుంబ నియంత్రణ తాత్కాలిక, శాశ్వత, పద్ధతుల గురించి తెలిపారు. కుటుంబ నియంత్రణ పాటించినప్పుడే తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉండి కుటుంబం సంతోషంగా వుంటుం దన్నారు. తాత్కాలిక కుటుంబ నియంత్రణ సేవలు ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితం గా లభిస్తుందని జనాభా ఆరోగ్యం, అంతరం, కుటుంబ నియంత్రణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, పంకజ, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న రొంపిచర్ల ఆరోగ్యకేంద్ర సిబ్బంది



ఎమ్మెల్యే యనమల దివ్యకు వినాయకుడి చిత్ర పటం అందిస్తున్న ఈవో

వరసిద్ధిని దర్శించుకున్న ప్రభుత్వ విప్

ప్రజాశక్తి- ఐరాల: వరసిద్ధి వినాయక స్వామిని తుని నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యనమల దివ్య దర్శించుకున్నారు. వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేసి స్వామి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, చిత్రపటాన్ని దేవస్థానం ఈవో పెంచల కిషోర్ అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, వాసు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి -చిత్తూరు (యాదమరి): ఇటీవల కె గొల్లపల్లె హైస్కూలు ప్లస్ నుంచి బదలీపై వెళ్లిన తొమ్మిది మంది టీచర్లను ఆ పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన నరసింహారెడ్డి, మహేష్ బాబు, వాణి, జి భారతి, సబిత, నీలవేణి, ఉష, మురళీధర్, విష్ణుప్రియలను పాఠశాల కమిటీ ఘనంగా శాలువాలు కప్పి బహుమతులు ఇచ్చి ప్రిన్సిపాల్ ఎపి లలిత ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వారి సేవల ఎన్నటికి మరువ లేని వని ఉపాధ్యాయులు కొనియాడారు. పిఆర్‌టియు రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకాచారి బదలీపై వెళ్లిన ఆరు గురు ఉపాధ్యాయునులకు పసుపు, కుంకుం, గాజులు, పండు తాంబూలం ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమీటి ఛైర్మన్ నవీన్, సభ్యులు వెంకటేష్, పురుషోత్తం, ఇన్ చార్జి భాస్కర రెడ్డి, సుల్తాన్, కనకాచారి, మదన్ మోహన్, మధు సూదన్, దామోదర్ రెడ్డి, అరుణ, యం భారతి, మంజులత, మంజుల, మహేష్, సుధాకర్, రాజేశ్వరి, రమాదేవి, ఆశ, ఆఫీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాము కాటుతో వ్యక్తికి అస్వస్థత

ప్రజాశక్తి - చౌడేపల్లి: చౌడేపల్లి మండలం 29 ఏ చింతమాకులపల్లి పంచాయతీ పిఎల్ కొత్తూరుకు చెందిన సీతప్ప కుమారుడు వెంకటరమణ (57)మామిడి తోటకు కాపలా కాస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మామిడి తోటలో పని చేస్తుండగా విష సర్పం కాటు వేసింది. ఇది గమనించిన స్థానికులు హుటాహుటిన పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సుపరిపాల

చంద్రబాబుతోనే సాధ్యం : ఎంపి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సుపరిపాలన, ప్రజల వద్దకు పాలన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమవుతుందని ఎంపి దగ్గమళ్ళ ప్రసాద్‌రావు, ఎంఎల్ఏ గురజాల జగన్మోహన్ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిత్తూరు నగరంలోని 16 వార్డు, దుర్గానగర్ కాలనీ, రోశీనగర్‌లో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యేలు గడపగడప కెళ్ళి సుపరిపాలనలో తొలి అడుగుకు సంబంధించిన కరపత్రాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చూడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్, కార్పొరేటర్ అశోక్, 16 వార్డు టిడిపి ఇన్‌ఛార్జి చిట్టిబాబు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలకు సత్వర పరిష్కారం

జెడ్‌పీ ఛైర్మన్ శ్రీనివాసులు



ప్రజాశక్తి -వి కోట : మండలంలోని హమాలీ వర్కర్స్ యూనియన్ పరిధిలోని సభ్యుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రమైన వి కోటలో శుక్రవారం హమాలీ వర్కర్స్ లోడింగ్ అండ్ అన్ లోడింగ్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక కన్యాకాపరమేశ్వరి వీధిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇటీవల హమాలి యూనియన్ నేతలు కలెక్టర్‌ను కలసి వికోటలో హమాలీలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సూచన మేరకు హమాలీలకు ఓగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయకాంత్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా సిబ్బంది వైద్య శిబిరంలో ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడచిన దశాబ్దాల కాలంగా మండలంలో లోడింగ్, అన్‌లోడింగ్ సేవలందిస్తున్న హమాలీలకు సరైన వైద్య సేవలు ఎంతో అవసరమన్నారు. వారి న్యాయమైన కోర్కెలు పరిష్కరిం చేందుకు తాము ఎల్లవేళ లా అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా హామలీలకు, బీపీ, రక్తపరీక్ష లు, చర్మవ్యాధులకు, మోకాళ్ల నొప్పులు, జ్వరానికి సంబంధించి పరీక్ష నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మాత్రలు, ఆయింటుమెంట్లు, ఇతర మందులు అందించారు. దాదాపు వంద మంది హమాలీలు, వారి కుటుంబ సభ్యులు, మండల ప్రజలకు ఉచిత వైద్య చికిత్స అందించారు. ఉచితవైద్య శిబిరం ప్రారంభానికి హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షులు తంగరాజ్, స్థానిక యూనియన్ కార్యదర్శి అరుణ్, నాయకులు పాల్గొన్నారు. హమాలీలకు ప్రత్యేకంగా వైద్య శిబిరం నిర్వహించాలని ఆదేశించిన కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు చైతన్య, తంగ రాజ్, అరుణ్‌లు కృతజ్ఞతలు తెలిపారు. వైద్య శిబిరంలో హామాలీలకు వైద్య సేవలు అందించిన ఓగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లకు, సిబ్బందికి హమాలీల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తనయుడు పి యన్ నాగరాజు, వార్డు సభ్యులు కుమార్ రాజు శశికళ, సంపత్, భాస్కర్ తో పాటు పెద్ద ఎత్తున హమాలీలు పాల్గొన్నారు.

అన్నదాత-సుఖీభవ' జాబితాలు సిద్ధం

ప్రజాశక్తి- చౌడేపల్లి: 'అన్నదాత-సుఖీభవ' పథకానికి అర్హులైన రైతుల జాబితాలు సిద్ధమయ్యాయని మండల వ్యవసాయ అధికారి మోహన్ కుమార్ తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. ఆధార్ నెంబరు ద్వారా 'నో యువర్ స్టేటస్'లో నకలు తీసుకోవచ్చునన్నారు, 'మన మిత్ర వాట్సాప్' ద్వారా లబ్ధిదారులు వివరాలను తెలుసుకునే వెసులుబాటు కల్పించారన్నారని తెలిపారు. జాబితాలో పేరు లేని అర్హులైన రైతులు రైతుసేవా కేంద్రంలో ఆధార్, భూమి వివరాలతో తగిన ధ్రువ పత్రాలు సమర్పించి, గ్రీవెన్స్ మాడ్యూల్లో నమోదు చేసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి మోహన్ కుమార్ తెలిపారు.

మామిడి రైతులు ఆందోళన చెందొద్దు

ఏపీఎస్ ఆర్‌టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం

ప్రజాశక్తి-కుప్పం : మామిడి రైతులు ఆందోళన చెందాల్సి న అవసరం లేదని, రైతులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఏపీఎస్ఆర్‌టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. కుప్పం పట్టణం మండల కార్యాలయ సమావేశ మందిరంలో ఉద్యానవన అధికారి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో మామిడి రైతులు మద్దతు ధర అందకుండా ఆందోళన చెందుతున్నారన్నారు. ముఖ్యంగా తోతాపురి రకం మామిడి పంట అనుకున్న ధర రాకపోవడంతో రైతులు చెందుతున్న ఆందోళనను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవడానికి సిద్ధంగా ఉందన్నారు. తోతాపురి మామిడికి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను చెల్లించడానికి పరిశ్రమల యాజమాన్యం, వ్యాపారులు సుముఖత చూపక పోవడంతో ప్రభుత్వమే రైతులను ఆదుకోవడానికి ముందుకు వచ్చిందని తెలిపారు. ఇందులో భాగంగా తోతాపురి మామిడి కిలోకు 4 రూపాయలు సబ్సిడీ ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిపారు. మామిడి పంటను రైతులు సాధారణంగా గుజ్జు పరిశ్రమలకు, మండీలకు, వ్యాపారస్థులకు విక్రాయిస్తుంటారని, కొంతమంది రైతులు పక్క రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారన్నారు. ప్రతి రైతుకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని గుజ్జు పరిశ్రమల వద్ద, మండీల వద్ద ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించిందని తెలిపారు. రైతులు పరిశ్రమలకు, మండీలకు విక్రయించిన మామిడి వివరాలను సంబంధిత అధికారుల వద్ద నమోదు చేయించుకోవాలని, ఇందుకోసం రైతులు తమ పాసు పుస్తకాలు, ఆధార్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం నకలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. తోట వద్ద పంటను వ్యాపారులకు విక్రయించిన రైతులు, తామే స్వయంగా పక్క రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్న రైతులు సంబంధిత వివరాలతో తమ సమీపంలోని రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని సూచించారు. అలా నమోదు చేసుకున్న రైతుల ఖాతాలకు ప్రభుత్వ సబ్సిడీ జమ అవుతుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పై సంబంధిత అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించి, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు వైద్యం శాంతారామ్, కుప్పం హార్టికల్చర్ ఏడీ పల్లవి, ఉద్యానవన అధికారి డింపు ప్రియా, వింధ్య, నాలుగు మండలాల తహశీల్దారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎస్ ఆర్‌టిసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం

'కీటక జనిత వ్యాధి' నియంత్రణ

ప్రజాశక్తి -శాంతిపురం : రాళ్లబూదుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం రాళ్లబూదుగూరు గ్రామ పంచాయతీ పిల్లిగానిపల్లి గ్రామంలో వైద్యాధికారిణి డాక్టర్ ఉషారాణి ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గృహానికి వెళ్లి ఆరోగ్య పరమైన సూచనలను చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా రోగాల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని తెలిపారు. ప్రతి గృహంలో లార్వా సర్వే చేసి, యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహించారు. జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి రక్త పరీక్షలు నిర్వహించారు. సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో డెంగీ నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి శివ శంకర్ ఆధ్వర్యంలో చెత్తను తొలగించి గ్రామాన్ని శుభ్రపరిచారు. రాళ్ళబూదుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వెంకటరమణ, హైమావతి ఆధ్వర్యం లో పిల్లిగానిపల్లి గ్రామాన్ని పర్యవేక్షణలో ఉంచి అవసరమైన వారికి రక్త పరీక్షలు చేయించడం, యాంటీ లార్వా ఆపరేషన్ చేయనున్నట్టు తెలిపారు .గ్రామంలోని ప్రజలు దోమల లార్వా ను గుర్తించి నీటి పరిసర ప్రాంతాలను శుభ్ర పరచడం, నీటి నిల్వ ఉండే పాత్రలపై మూత పెట్టడం చేయడం ద్వారా దోమలను నిర్మూలించ వచ్చని తెలిపారు. దోమలు నివార ణకు పంచాయతీ వారే గ్రామంలో ఫాగింగ్ చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్ర సిబ్బంది



ఆస్పత్రి రోగులకు భోజనం ప్యాకెట్లు అందిస్తున్న వైసిపి నాయకులు

రోగులకు అన్నదానం

ప్రజాశక్తి -కార్వేటినగరం: కార్వేటినగరం ఎంపీపీ రాయల చెరువు లతబాలాజీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో లతబాలాజీ అభిమానులు రోగులకు పళ్లు, స్వీట్లతో పాటు అన్నదానం నిర్వహించారు. రాత్రి గాస్ వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనంజయ వర్మ మాట్లాడుతూ మాజీ జెడ్పీటిసి, వైసిపి సీనియర్ నాయకుడు ఆర్ శ్రీరాములు నాయుడు కాలం నుంచి పేద విద్యార్థులకు, వృద్ధులకు, రోగులకు అన్నదానం చేయడం ఆనవాయితీగా మారింది. తన కుమారుడు వైసిపి సీనియర్ నాయకుడు, ఎంపీపీ లతబాలాజీ తన పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని ప్రతి ఏడాది అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం రోగులకు పండ్లు, స్వీట్లు పంచిపెట్టి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుణలోకనాథనాయుడు, ఎంపీటీసీ మురుగయ్య, సాయికుమార్, గౌతమ్, డాక్టర్ శృతి భాగ్యం, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.



మొక్కల పంపిణీ

ప్రజాశక్తి- కుప్పం : కుప్పం అటవీ శాఖ అధికారి జయశంకర్ శుక్రవారం మొక్కలు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా కుప్పం మండల పరిధిలోని పాఠశాలలకు 11,800 మొక్కలను, గుడుపల్లి మండల పరిధిలోని పాఠశాలలకు 4000 మొక్కలను పంపిణీ చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్ల వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని సూచించారు. మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలను గుర్తించిన ప్రభుత్వం మొక్కలు నాటే కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వాములను చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అటవీ శాఖ ద్వారా మొక్కలను పంపిణీ చేశామని తెలిపారు.



కబ్జా స్థలాన్ని పరిశీలిస్తున్న గ్రామ రెవెన్యూ అధికారి

ప్రభుత్వ స్థలాలు కబ్జా

చర్యలు తప్పవని అధికారుల హెచ్చరిక

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు మున్సిపల్ పరిధిలోని గడ్డూరు కాలనీలో ప్రభుత్వ స్థలాల్లో పుట్టగొడుగుల్లా పునాదులు పుట్టుకొస్తున్నాయి. ప్రభుత్వం కమ్యునల్ పర్పస్ కోసం ఉంచిన స్థలాల్లో సైతం దర్జాగా పునాదులు వేస్తున్నారన్న సమాచారంతో విఆర్ఓ ప్రకాష్ శుక్రవారం మధ్యాహ్నం రెండున్నర గంటల ప్రాంతంలో ఘటన ప్రాంతానికి చేరుకొని 'గతంలో మీకు ఇది ప్రభుత్వ స్థలం అని చెప్పినా పట్టించుకోకుండా మళ్లీ మీరు పనులు ప్రారంభిస్తున్నారు. ఎక్కడ పనులు అక్కడే ఆపేయండి లేదంటే పోలీస్ కంప్లైంట్ ఇవ్వాల్సి వస్తుంది..!' అంటూ హెచ్చరించారు.

'ఓవర్ హెడ్ ట్యాంకు'కు మరమ్మతులు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం నంజంపేట పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరియు బస్టాండ్ సంత గేటు వద్ద ఉన్న రెండు ఓవర్ హెడ్ ట్యాంకుల నిచ్చెనలు తుప్పు పట్టి శిథిలావస్థకు చేరడంతో పంచాయతీ కార్యదర్శి మణికుమార్ శుక్రవారం పరిశీలించి వాటికి మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఓవర్ హెడ్ ట్యాంకులు ఎక్కడానికి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయడానికి నిచ్చినలపై వెళ్లాలంటే ఇబ్బంది కరంగా ఉందని ఏదైనా ప్రమాదం జరిగితే తర్వాత సమస్యలు వస్తాయన్న ఉద్దేశంతో రెండు ట్యాంకుల ఇనుప నిచ్చెనలను బాగు చేయించి అక్కడక్కడ కొత్త ఇనుప కమ్మీలు ఏర్పాటు చేశామని తెలిపారు.